నేడు నారమ్స్ 49న ఫౌండేషన్ డే

ఏజీవర్సిటీ: నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ (నారమ్స్) 49న ఫౌండేషన్ డే నేడు సెప్టెంబర్ 1న నిర్వహించడం జరుగుతుందని నారమ్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. నారమ్స్‌లోని స్వామినాథ్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ ఫౌండేషన్ కార్యక్రమానికి న్యూఢిల్లీ ఐసీఏఆర్ డీడీజీ డాక్టర్ ఆర్‌సీ అగ్రావాల్ అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్

బండ్లగూడ: బైరాగిగూడ, గంధంగూడ పారిశుద్ధ్య సిబ్బందికి శనివారం మున్సిపల్ డివిజన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు కష్టపడి పని చేస్తున్నారని, వాళ్ల శ్రమను గుర్తించి కార్పొరేషన్ తరపున సబ్బులు, బియ్యం, రెయిన్ కోర్టు, షూ, చెప్పులు తదితర వాటితో పాటు నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టి తేవాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, బలరాం , లక్ష్మమ్మ, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మొదలైన సిద్దులగుట్ట జాతర



శంషాబాద్ పట్టణంలోని వెండి కొండ (సిద్దుల గుట్ట) జాతర శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. బసవేశ్వ రాలయం నుంచి స్వామి వారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. పల్లకిలో తీసుకొచ్చిన స్వామివారిని పట్టణ ప్రజలు దర్శించుకున్నారు. సిద్దులగుట్ట చేరుకున్న అనంతరం గణపతి, ఆంజనేయ స్వామి అభిషేకాలు నిర్వహించారు. రెండోరోజు ఆదివారం స్వామివారి రుద్రాభిషేకం, అమ్మవారి అభిషేకం, కుంకుమార్చన, వీరభద్రేశ్వరస్వామి అభిషేకం మధ్యాహ్నం అన్నప్రసాదం రాత్రికి పార్వతిపరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నారు.

ఉద్యోగుల పదవీ విరమణ



పదవీ విరమణ పొందిన రామకృష్ణ పరమహంస దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాలలో శనివారం ఉద్యోగుల పదవి విరమణ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో కళాశాల అడ్మినిస్ట్రేటీవ్ అధికారిగా విధులు నిర్వహించిని రామకృష్ణ పరమహంస పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ ప్రశాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన రమేష్ పదవి విమరణ పొందారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ అధికారులు, నయీమ్, యాదగిరి, హరి నారాయణల ఆధ్వర్యంలో రమేష్‌ను ఘనంగా సన్మానించారు.

సెక్యూరిటీ ఆఫీసర్‌కు సన్మానం



రమేష్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

రాజేంద్రనగర్: పీజేటీఎస్ఏయు ప్రధాన కార్యాలయంలో శనివారం పదవీ విరమణ చేసిన సెక్యూరిటీ ఆఫీసర్ రమేష్‌ను సత్కరించి వీడ్కోలు పలికారు. ఏఎస్‌ఓలు నజీర్, యాదగిరి, హరినారాయణ్‌ల ఆధ్వర్యంలో సెక్యూరిటీ సంఘం తరపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సన్నీ, నరసింహ, రాము, బాలయ్య, సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ నుంచి ప్రవహిస్తున్న మురుగు నీరు



బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కిస్మత్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో గత మూడు నెలలుగా మ్యాన్‌హోల్ నుంచి మురికి నీరు వస్తున్నాయని, ఎవ్వరూ పట్టించుకునే వారు లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్ నిండి డ్రైనేజీ నుంచి బయటకి రావడంతో పలుమార్లు స్థానికులు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వెల్లడిస్తున్నారు. మురుగునీటితో దోమల బెడద ఎక్కువైందని, పరిస్థితి ఇలాగే ఉంటే పలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. వెంటనే మ్యాన్‌హోల్‌కు మరమ్మత్తులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కాలనీల చెంత.. వారాంతపు సంత



- తాజాకూరగాయల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి

అత్తాపూర్: వారాంతపు సంతలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతున్న క్రమంలో అంతకు రెట్టింపుస్థాయిలో ప్రజలకు తాజా కూరగాయలు, పండ్లు, నిత్యవసర సరుకులు విక్రయిస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో వారాంతపు సంతలతో సాయంత్రం ఆయా ప్రాంతాలు వినియోగదారులతో కిక్కిరిసిపోతున్నాయి. సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి ఉడంగడ్డ లక్ష్మీగూడ, బాబుల్‌రెడ్డినగర్ మార్కండేయ నగర్, ప్రేమావతిపేట్ నగర్, గగన్‌పహాడ్ శివరాంపల్లి రాజేంద్రనగర్ టీడీపీ చౌరస్తా బుద్వేల్ హైదరగూడ అత్తాపూర్ ప్రాంతాల్లో వారాంతపు సంతలు నిర్వహిస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి..

వారాంతపు సంతల్లో ముఖ్యంగా వివిధ రాష్ట్రాల నుంచి బతుకు దెరువు కోసం వచ్చిన గుజరాతీలు బెంగాలీలు, మహారాష్ట్ర వాసులు, కర్ణాటక మధ్యప్రదేశ్ ప్రాంతానికి చెందినవారు సింహభాగంలో నిలుస్తున్నారు. స్థానికంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న వీరంతా శంషాబాద్ మార్కెట్ నుంచి కొనుగోలు చేసిన కూరగాయలు, నిత్యావసర వస్తువులను స్థానికంగా ఏర్పాటు చేసుకున్న సంతలలో విక్రయిస్తున్నారు. కుటుంబానికి వారం రోజులకు సరిపడా కూరగాయలు కొనుగోలు చేయడానికి గుడిమల్కాపూర్, మిర్యాల మండీ, మెహిదీపట్నం రైతుబజార్ వెళ్లే వారమని ఇటీవల నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్థానిక కూరగాయల మార్కెట్లతో ఎంతో ఉపయోగకరంగా మారాయని శ్రామికులు అభిప్రాయం పడుతున్నారు. స్థానిక ప్రజల సహకారం లభించడంతో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారు కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగు పడడంతో దూర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి కుటుంబీకులను కూడా పిలిపించుకుంటున్నారు.



కూరగాయలను అమ్ముతున్న విక్రయదారులు

పదేళ్లుగా విక్రయిస్తున్నాను..



పది సంవత్సరాలుగా ఆకుకూరలు, కూరగాయలు స్థానిక మార్కెట్లో విక్రయిస్తూ స్థానికంగా స్థిరపడిపోయాను. కాలానికనుగుణంగా మార్కెట్‌లో లభిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు తీసుకువచ్చి విక్రయించడం జరుగుతుంది. బతుకుదెరువు కోసం వచ్చిన నేను స్థానిక ప్రజలు ఆదరించడంతో తన ముగ్గురు కూతుర్ల వివాహం చేసి కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవిస్తున్నాం.

– మహమ్మద్ మోహినుద్దీన్, మహారాష్ట్ర వాసి

తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా..



కుటుంబం పోషణలో తండ్రికి భారం కాకుండా ప్రతి ఆదివారం అత్తాపూర్ జనప్రియ వద్ద జరిగే సంతలో కూరగాయలు విక్రయిస్తున్నాను. విజేఐటీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సరం చదువుతున్నాను. చదువు పూర్తి అయిన తర్వాత ఉద్యోగం చేసి సొంతంగా ఒక పరిశ్రమను స్థాపించి పదిమంది యువకులకు ఉద్యోగాలను ఇచ్చేస్థాయికి వెళ్తాను. యువకులు అమూల్యమైన సమయాన్ని వృధ్ధా చేయకుండా చదువుతోపాటు తల్లిదండ్రులకు అండగా నిలబడాలని కోరారు.

– వీరేష్, విజేఐటీ కళాశాల విద్యార్థి

సౌకర్యంగా ఉంది..



మా వాడలో ప్రతి ఆదివారం కూరగాయల మార్కెట్ నిర్వహిస్తారు. తాజా కూరగాయలు ఆకుకూరలు వారం రోజులకు సరిపడా కొనుగోలు చేస్తాను. అందుబాటు ధరలో ఉన్న కూరగాయలు సమృద్ధిగా ఆహారంలో సగభాగం చేర్చుకుంటాము. ఉద్యోగ రీత్యా వారం రోజులు బిజీగా ఉండే తనలాంటి వారికి వీకెండ్స్‌లో ఆదివారం జరిగే ఈ సంత మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– ప్రభుత్వ ఉపాధ్యాయురాలు లక్ష్మీ

జనారోగ్య రక్షణ.. విజయ లక్ష్యం



తయారీ కేంద్రంలో విజయ ఆయిల్ బాటిళ్లను చూపుతున్న మేనేజర్ కొత్తకాపు వెంకటేశ్వర్‌రెడ్డి

అత్తాపూర్: తిండి లేనిదే కండరాదు.. కండలేనిదే సంపద ఉత్పత్తి జరగదు. ఆ తిండి నాణ్యమైనది లభించనప్పుడు మనిషి పనిచేయలేడు కదా. ఇక్కడ సమస్య అదే. నిత్యావసరాల్లో కీలకమైన వంటనూనెల్లో కల్తీ మనిషిని అనారోగ్యపాలజేస్తుంది. ప్రజల జీవనశైలిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రజలు, వినియోగదారుల నుంచి వస్తున్న డిమాండ్లకు అనుగుణంగా సాంప్రదాయ వేరుశెనగ నూనెను విజయ ఆయిల్ అందిస్తున్నది. ప్రజల నుంచి వస్తున్న పెరిగిన డిమాండ్ మేరకు ఉత్పత్తిని పెంచేందుకు ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో కోల్డ్ ప్రెస్సుడు వేరుశనగ నూనెను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని విజయ ఆయిల్ శివరాంపల్లి యూనిట్ మేనేజర్ కొత్తకాపు వెంకటేశ్వర్ రెడ్డి సాక్షికి వివరించారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా తమ సంస్థ ఆధ్వర్యంలో గత 38 సంవత్సరాలుగా విజయ పేరుతో పలు రకాల వంటలు నూనెలు అందిస్తున్నదని తెలిపారు. మేలు రకం వేరుశనగ నిక్కచ్చిగా పాటిస్తూ రూ. 295లకు మాత్రమే ఒక లీటర్ ఆయిల్‌ను వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ఫెడ్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు శివరాంపల్లిలోని ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ ప్యాకేజీ యూనిట్లో ప్రత్యేకంగా తయారు చేయించిన కోల్డ్ ప్రెస్డ్ యూనిట్లు విస్తరింప చేస్తున్నట్లు వెంకటేశ్వర్ రెడ్డి వివరించారు. పట్టణ ప్రాంతాల్లో విజయ బ్రాండ్లకు మంచి ఆదరణ ఉన్నదని గ్రామీణప్రాంతాల్లో కూడా మరింత ఇలాంటి అవగాహన కల్గించేందుకు ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలను సిద్ధం చేస్తూ ముందుకు సాగుతున్నామని ఆయన వివరించారు.

3న విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సెప్టెంబర్ 3న నిర్వహించడం జరుగుతుందని రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి తెలిపారు. విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరగనున్న వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బీజే రావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. విశ్వవిద్యాలయం ఏర్పాటై 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా విశ్వవిద్యాలయం అనేక జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిందని తెలిపారు. ఈ 10 సంవత్సరాల్లో 5 కొత్త వ్యవసాయ కళాశాలలు, ఒక ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల, 4 వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో 1360 సీట్ల సంఖ్యను పెంచడం జరిగిందని అన్నారు. దీంతో పాటు అమెరికాలోని అబర్న్ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్‌లో పీజీ కోర్సు అభ్యసించేందుకు విద్యార్థులకి ఓవర్సీస్ ఫెలోషిప్ అందించడం జరిగిందని తెలిపారు. 9 డాట్ కేంద్రాలు, 8 కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రాష్ట్ర రైతాంగానికి విస్తృతంగా విస్తరణ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్ విభాగం, రాష్ట్ర వ్యవసాయశాఖ కలిసి రూపొందించిన రైతు నేస్తం అనే ప్రత్యక్ష చర్చా కార్యక్రమాన్ని సీఎం మార్చి 6వ తేదిన 2024న ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 556 రైతు వేదికల్ని అనుసంధానం చేసి సుమారు లక్ష 30 వేల మంది రైతులకు సలహాలు సూచనలు అందించామన్నారు. గత 10 సంవత్సరాలలో వీటితో పాటు అనేక విజయాలు సాధించడం జరిగిందని, 10వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పలువురు ఉత్తమ రైతులకు, సిబ్బందికి అవార్డులను అందజేయడం జరుగుతుందని అన్నారు.

కమ్యూనిటీహాల్ కోసం స్థలం కేటాయించండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు, కాలనీవాసులు

రాజేంద్రనగర్: శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీ, ప్రశాంత్ కాలనీలు వివిధ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించేందుకు కమ్యూనిటీ హాల్ లేక ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ మేరకు శనివారం రాజేంద్రనగర్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీ (కాటేదాన్ రెవెన్యూ సర్వే నంబర్ 23)లో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నందున స్థానిక కాలనీ వాసులకు కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం స్థలాన్ని మంజూరు చేయాలన్నారు. కొందరు ఈ ప్రభుత్వ భూమిపై కన్నేసి తప్పుడు పత్రాలతో కబ్జాకు యత్నిస్తున్నందున కమ్యూనిటీహాల్‌కు స్థలం కేటాయించాలని కోరారు. అధికారులు పూర్తిస్థాయిలో స్థలాన్ని పరిశీలించి సర్వే నంబర్‌లో కమ్యూనిటీహాల్‌కు స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, రమాకాంత్, ప్రధాన కార్యదర్శి రఘురాజ్, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, శ్రీధర్, కాలనీవాసులు రాజ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి చర్యలు



శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ సొసైటీ పరిధిలో రుణమాఫీ కాని రైతుల నుంచి శనివారం వివరాలు సేకరించారు. ఆయా రైతుల కుటుంబ నిర్ధారణ కారణాలు, సాంకేతిక సమస్యలను సరి చేసేందుకు దరఖాస్తులు స్వీకరించారు. రైతులకు వీలైనంత త్వరగా రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సొసైటీ చైర్మన్ దొనాకర్‌గౌడ్ అన్నారు.

సీబీఐటీలో రుతుపవనాల నమూనాలపై సెమినార్



ప్రొఫెసర్‌ను సత్కరించిన అధ్యాపకులు, విద్యార్థులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో శనివారం రుతుపవనాల నమూనాలు, దాని భవిష్యత్తు అంచనాలు, నీటి వనరులు, వ్యవసాయ సమస్యలు అనే అంశంపై ఒక రోజు సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ కులకర్ణి శశికాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వాతావరణ మార్పుల నామూనాల భవిష్యత్తు అంచనా ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం సివిల్ ఇంజనీరింగ్ సహాయ ప్రొఫెసర్ రంగారెడ్డి పదవీ విరమణ పొందటంతో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ జగన్నాథరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎంజీఐటీ' విద్యార్థుల ఎంపిక



శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకుడు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలకు చెందిన 6 మంది విద్యార్థులు వేద ఐఐటీ వారు నిర్వహిస్తున్న వీఎల్ఎస్ఐ, ఎంబేడ్డెడ్ సిస్టమ్ డిజైన్ శిక్షణకు ఎంపికైనట్టు ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సింగ్ తెలిపారు. జేఎన్‌టీయు హైదరాబాద్ వారిచే ఆమోదింపబడిన ఈ వృత్తి శిక్షణ కార్యక్రమానికి రెండు విడతలుగా నిర్వహించిన ప్రవేశపరీక్ష ద్వారా ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేసుకున్నారని ఆయన వివరించారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లు వారిని అభినందించిందన్నారు.

21,22 తేదీల్లో రాజయోగ రెసిడెన్షియల్ రీట్రీట్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 21,22 తేదీలలో రాజయోగ రెసిడెన్షియల్ రీట్రీట్ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ రీట్రీట్ కార్యక్రమాన్ని తెలుగుభాషలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా, అలాగే బ్రహ్మకుమారీస్ సెంటర్లలో కూడా నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

గచ్చిబౌలి: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. వర్షాల నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో వర్షాల వల్ల ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. వాతావరణ శాఖ సూచనల మేరకు అత్యవసరం అయితేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని చెప్పారు. ముఖ్యంగా విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులు, లేదా తమ కార్యాలయాన్ని సందర్శించాలన్నారు.

న్యాయవాద వృత్తి పవిత్రమైనది

గోల్కొండ: న్యాయవాద వృత్తి పవిత్రమైనదని ప్రముఖ హైకోర్టు న్యాయవాది మహ్మద్ ఆజామ్ అన్నారు. టూమ్స్ చౌరస్తాలో న్యాయవాది మీర్జా ఎక్బాల్ అహ్మద్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆజామ్ మాట్లాడుతూ చట్టాలపై గౌరవం, అపార నమ్మకం ఉన్న వారే న్యాయవాద వృత్తిలోకి వస్తారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జునైద్, మీర్జా ఎక్బాల్ అహ్మద్, మిర్జా జమీల్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

శేరిలింగంపల్లి: నల్లగండ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లాసమ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను శనివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు ఎం.రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, ఆర్ శేషగిరిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన కల్పించాలన్నారు. బ్లాసమ్స్ స్కూల్ డైరెక్టర్లను అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, నాయకులు మిరియాల రాఘవరావు, లక్ష్మీనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య కేసులో యువకుడి రిమాండ్

మైలార్‌దేవ్‌పల్లి: మైనర్ బాలిక ఆత్మహత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడిని రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. గత నెల 18న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్‌లో నివసించే మైలార్ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది.కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని సొంత గ్రామంలో పూడ్చిపెట్టారు. తర్వాత వంశీ అనే యువకుడు వేధించడంతోనే కారణంగా తన కుమార్తె చనిపోయిందని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. మహేశ్వరం ప్రాంతానికి చెందిన డెలివరీ బాయ్‌గా చేస్తున్న వంశీని శుక్రవారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

సభ్యత్వ నమోదును పండుగలా నిర్వహించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఓ పండుగలా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడం మల్లారెడ్డిలు అన్నారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు సమావేశం అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 02.09.2024న భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభిస్తున్న బీజేపీ సభ్యత్వ నమోదు కొరకు అందరూ 8800002024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వ నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు అందరూ 100 మందికి పైగా సభ్యత్వం నమోదు చేయించాలని కోరారు. ప్రతి బూతులో 200 మందికి పైగా సభ్యత్వం చేయాలని తెలియజేశారు. అత్తాపూర్ డివిజన్‌లో ఇంటింటికి తిరిగి 20వేల మందితో ప్రతి ఒక్కరితో సభ్యత్వం చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొమురయ్య, సుదర్శన్, ప్రసాద్, రాజశేఖర్, కిరణ్‌చారి, జగన్, శేఖర్, బాలకృష్ణ, రాము, యాదగిరి రెడ్డి, విజయ్ రావుత్, గోపాల్, ఉమా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'అమర్ సొసైటీకి అన్ని అనుమతులు ఉన్నాయి'



సమావేశంలో మాట్లాడుతున్న అమర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు

గచ్చిబౌలి: దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌ను తాము ఆక్రమించలేదని, వాల్టా చట్టం రాకముందే అన్ని అనుమతులు తీసుకున్నామని అమర్ కోఆప్‌రేటివ్ సొసైటీ సభ్యులు స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం సొసైటీ సభ్యుడు గోపాలకృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల క్రితం అన్ని అనుమతులతో నిర్మించిన మా ఇళ్లు తప్పయితే...దుర్గం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కూడా తప్పేనని పేర్కొన్నారు. 1995లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో హుడా లేఅవుట్‌కు తుది అనుమతి వచ్చిందన్నారు. 2000 సంవత్సరంలో వరదలు వచ్చినప్పుడు ఎలాంటి శాస్త్రీయత లేకుండా ఇళ్లు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తాయని ఇరిగేషన్ అధికారులు మార్కింగ్ చేశారని తెలిపారు. 2022లో ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రాదని అదే ఇరిగేషన్ అధికారులు నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు దుర్గం చెరువు విస్తీర్ణం 165 ఎకరాలు అని చెప్పడం సహేతుకంగా లేదన్నారు. నోటీసులపై న్యాయస్థానానికి వెళ్లామని న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.